ప్రజాశక్తి
శనివారం 6 మే 2023
I
అల్లూరి సీతారామరాజు



ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:మండలంలోని కిల్లోగూడ జంక్షన్‌లో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు వాహన రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. వాహన రికార్డులు లేని వారిపై చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

అల్లూరి జిల్లాలో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకానికి...

రూ.1.91 కోట్ల నిధులు విడుదల

ప్రజాశక్తి-పాడేరు : వైఎస్ ఆర్ కళ్యాణ మస్తు, షాదీ తోఫా కింద జిల్లాలో 193 మంది లబ్ధిదారులకు రూ.1కోటి 91 లక్షల 35 వేలను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు.. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో పాటు పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మిలు సిఎం ప్రారంభించిన ఎస్ ఆర్ కళ్యాణ మస్తు, షాదీ తోఫా ప్రత్యక్ష ప్రసారాన్ని శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అరకు నియోజక వర్గంలో 81 మంది లబ్ధిదారులకు, పాడేరు నియోజక వర్గంలో 48 మంది, రంప చోడవరం నియోజక వర్గంలో 64 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. జిల్లాలో వెనుకబడిన వర్గాలు 16 మంది, దివ్యాంగులు ఇద్దరు, ఎస్సీలు 16 మంది, షెడ్యూల్డు తెగలు 159 మందికి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు.

పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, పేద కుటుంబాల చెల్లెమ్మల వివాహాలకు వై ఎస్ ఆర్ కళ్యాణ మస్తు, వై ఎస్ ఆర్ షాదీ తోఫా ఆర్థిక అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు కులాల వివాహాలకు రూ.1లక్ష, కులాంతర వివాహాలకు రూ.1.20 వేలు, వెనుకబడిన వర్గాలకు రూ.50 వేలు, కులాంతర వివాహాలకు రూ. 75 వేలు, మైనార్టీలకు రూ.1 లక్ష, దివ్యాంగులకు రూ.1.50వేలను ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం లబ్దిదారులకు నమూన చెక్కును అంద జేసారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు జె.సుభద్ర లబ్దిదారులతో మాట్లాడుతూ. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్దిదారుల స్పందనను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి చైర్మన్ శోభ స్వాతి రాణి, డిఆర్‌డిఏ పిడి వి.మురళి, పలువురు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జిఓ 1ని ఉపసంహరించుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: అప్రజాస్వామిక జి.వో 1కు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఒక వైపు ఆందోళనలు జరుగుతుంటే పకడ్బందీగా అమలు చేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం గర్హనీయమని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలను, పౌరహక్కులను హరించి వేసే జివో 1ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను సమీక్ష చేస్తూ జివో 1ని పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు వచ్చిన వార్తలు విస్మయం కలిగిస్తున్నాయన్నారు. జివో 1కు వ్యతిరేకంగా రాష్ట్రంలో పౌరహక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, లాయర్లు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు నిరంతరంగా నిరసనలు, ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోగా మరింత తీవ్రంగా అమలు చేయమని చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అప్రకటిత నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయని, ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల సభలకు అనుమతి నివ్వడం లేదని చెప్పారు.ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలకు ముందే గృహనిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేస్తున్నారన్నారు. అధికార పార్టీ నిర్వహించే సభలకు ఈ షరతులేవీ వర్తించకపోవడం చూస్తుంటే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నోరు నొక్కే ప్రయత్నమే నని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ నిరంకుశ వైఖరిని ప్రజాస్వామిక వాదులు, మేధావులు నిరసించాలన్నారు. ప్రతిష్టకు పోకుండా ఇప్పటికైనా జివో 1ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.




ఇసుక డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు ఐవి తదితరులు

గుండాల ఇసుక డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి

- సిపిఎం మండల కార్యదర్శి ఐవి

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని గుండాల గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు నిర్వాహకులు, ఇప్పుడు జనావాసాల పక్కనే డంపింగ్ యార్డ్ పెట్టి మరో అక్రమ పనికి పూనుకున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఐవి అన్నారు. శుక్రవారం ఆయన స్థానికులతో కలిసి గుండాల ఇసుక డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సమయంలో అక్కడకు ఇసుక డంప్ చెయ్యడానికి లోడ్‌తో వచ్చిన లారీని అడ్డగించి వెనక్కు పంపించారు. ఈ సందర్భంగా ఆయటున మాట్లాడుతూ గోదావరి నదిలోని ఇసుకను తోడి గుండాల గ్రామంలోని ఇళ్ల పక్కనే డంప్ చేస్తున్నారని, ఇక్కడికి లారీలు, ట్రాక్టరులు రాకపోకలు సాగించడంతో దుమ్ము, ధూళి నివాసాలపై పడుతుందని తెలిపారు. దీని వల్ల ఈ డంపింగ్ యార్డుకు పక్కనే ఉన్న కుటుంబాల వారికి శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ నుండి ఇసుక డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్థానికులు గట్టిగా నిలబడితే సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకిశెట్టి రాము, జి.హుస్సేన్, నూతలపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు

అటవీశాఖ అధికారులు సహకరించాలి

జెడ్‌పిటిసి గంగరాజు వినతి

ప్రజాశక్తి-హుకుంపేట:రోడ్ల అనుమతులకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు కోరారు. అనంతగిరి మండలం మారుమూల పంచాయతీలు శంకుపర్తి, పట్కదవడ, దొనిమోరి బొంగిజ తదితర గ్రామాలకు మంజూరైన రోడ్లకు అనుమతులు మంజూరు చేయాలని అనంతగిరి మండలం బొర్ర ప్రాంతంలో ఫీల్డ్ పర్యటనకు వచ్చిన అట్టవీశాఖ డి.ఎఫ్.ఒ వినోద్ కుమార్‌కు అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు వినతిపపత్రాన్ని అందజేశారు. అనంతరం గంగరాజు మాట్లాడుతూ, మారుమూల గుమ్మకోట పంచాయతీ గుమ్మకోట నుండి శంకుపర్తి వరకు 2016-17 సంవత్సరంలో నిధులు మంజూరై 8 సంవత్సరాలు కావస్తున్నా అటవిశాఖ అధికారులు అనుమతుల పేరుతో అభివృద్ధిని అడ్డుకొంటు రోడ్డు నిర్మాణాలు ఆపుతున్నారన్నారు. గ్రామంలో పర్యటించి దర్యాప్తు చేసి తక్షణమే అనుమతులు ఇప్పంచాలని డిఎఫ్.ఒ వినోద్ కుమార్‌ను కోరారు.గిరిజనుల పట్ల చిత్తశుద్ధి లేని అధికారులతోనే గిరిజన వ్యవస్థ కుంటుపడుతుందన్నారు. ఒక్క పక ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లు డోలీ మోతలు లేని గ్రామాలుగా ఉండాలని నిధులు మంజూరు చేసి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినా ఫారెస్ట్ అధికారులు ఆటంకంగా మారుతున్నారని ఆయన అన్నారు. దీంతో గిరిజనులు ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు ఈ విషయమై ప్రస్తావించినా స్పందించక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు రోడ్ల అనుమతులు మంజూరు చేయకపోతే జిల్లా పరిషత్, పాలక వర్గాల సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, బొర్ర సర్పంచ్ జన్ని అప్పారావు, నరాజి సురేష్, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న గంగరాజు

అందరి సహకారంతో ..

మాతృ మరణాల నియంత్రణ

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎం., అంగన్వాడీ సూపర్వైజర్లు, సిడిపిఒలు, మెడికల్ అధికారులు వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహిస్తే మాతా శిశు మరణాలు జరగవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మాతృ మరణాలపై కలక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో కలక్టర్ మాట్లాడుతూ, ఇటీవల ముంచింగిపుట్టు, కొయ్యూరు, చింతపల్లి, జికెవీధి, దుంబ్రిగుడ, హుకుంపేట మండలాల ఫరిధిలో మాతృ మరణాలపై సంబంధిత మెడికల్ అధికారులు, సిడిపిఓలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల నుండి వివరణ తీసుకున్నారు. ప్రతి నెలలో గర్భినీలను తప్పనిసరిగా సందర్శించి వారికి రక్త హీనత, బరువు తక్కువ బిడ్డలు, ఇతర వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వారికి అవసరమైన పౌష్టికాహారం, ఐరన్, పోలిక్ ఆసిడ్ మాత్రలు వేయించాలని, ఎప్పటికప్పుడు బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణీల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గర్భిణీలను ముందుగానే గుర్తించి నమోదు చేయడం, ఫాలో అప్‌తో మరణాల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. డెలివరీని ముందుగానే గుర్తించి ఆసుపత్రి ప్రసవాలకు సంసిద్ధం చేయాలన్నారు. హెపటైటిస్ బి, హెచ్ ఐ వి పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. నలుగురు మించి పిల్లలను కనడంతో రక్త హీనత, తదితర సమస్యలతో మరణించే అవకాశం ఉన్నందున అటువంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కల్పించాలని సూచించారు.రికార్డులు సరిగా నిర్వహించని దుంబ్రిగుడ పిహెచ్‌సి మెడికల్ అధికారి, ఎఎన్‌ఎం, ఆశ, సూపర్వైజర్ల నుండి సంజాయిషీ కోరల్సిందిగా కలక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, ఐసిడిఎస్ పథక సంచాలకులు ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా ఆసుపత్రి పర్యేక్షకులు కృష్ణారావు, పెదబయలు, ఆర్జే పాలెం, తాజంగి, సీలేరు, దుంబ్రిగుడ, హుకుంపేట పిహెచ్‌సిల మెడికల్ అధికారులు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్



చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

సిహెచ్‌సిలో ఎముకల శస్త్ర చికిత్సలు ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సహకారాలతో చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)లో శుక్రవారం నుండి ఎముకల శస్త్ర చికిత్సలు ప్రారంభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవి.కోటిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో జిల్లా కలెక్టర్ చింతూరు ప్రభుత్వ వైద్యశాలను సందర్శించినప్పుడు చెవి, ముక్కు, గొంతు, ఎముకలు శస్త్ర చికిత్సలు చేయడానికి కావాల్సిన పరికరాలపై ఆరా తీశారని తెలిపారు. వాటి కొనుగోలుకు రూ.10 లక్షల వరకు అవుతుందని చెప్పడంతో కలెక్టర్ రూ.10 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. పరికరాలు కొనుగోలు అనంతరం శుక్రవారం శస్త్ర చికిత్సలు ప్రారంభించినట్లు చెప్పారు. విఆర్.పురం మండలం సోమలగూడెం గ్రామానికి చెందిన మిడియం కృష్ణకు ప్రమాదంలో మోచేతి ఎముక విరిగి పోగా, ఆయనకు శుక్రవారం ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. ఓరిఫ్ పద్ధతి ద్వారా కౌశిక్, శశిరేఖ, స్వర్ణలత ఆధ్వర్యంలో పేషెంట్ కృష్ణకు మత్తుమందు స్పెషలిస్ట్ కోటిరెడ్డి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు. చింతూరు డివిజన్‌లో ప్రజలకు స్పెషలిస్ట్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని విధాల సహకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒకు కృతజ్ఞతలు తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న రమాప్రభ

గిరి బాల నేస్తం ఆధ్వర్యంలో

సమ్మర్ వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- అరకులోయ:స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో గిరి బాల నేస్తం చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా వర్క్ షాప్ సమ్మర్ క్యాంపు శుక్రవారం ప్రారంభమైంది. రోటరీ క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ సహకారంతో ఈ నెల 5, 6వ తేదీలలో జరుగుతున్న ఈ వర్క్ షాప్ లో ఆంధ్ర ప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పిల్లలకు ఆటపాట నేర్పించడమే కాకుండా క్యాంప్ ఉపయోగంపై మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్య పరంగా వెనుకబడిన గిరిజన విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించడానికి గిరి బాల నేస్తం ఆధ్వర్యంలో 3 సంవత్సరాల నుంచి జిల్లాలో గిరి బాల నేస్తం చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. నైపుణ్యాన్ని, సజనాత్మకతను వెతికి తీసే బొమ్మలను తయారు చేయడం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుతూ గిరి బాల నేస్తం గిరిజన ప్రాంతంలో విజ్ఞానం, వినోదం, వికాసం పెంచడం జరుగుతుందన్నారు.

గిరి బాల నేస్తం జిల్లా కన్వీనర్ వివి జయ మాట్లాడుతూ, ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తారని ఆమె అన్నారు. నైపుణ్యాన్ని సజనాత్మకతను వెలికి తీసే బొమ్మలను తయారు చేయడమే కాకుండా, డ్రాయింగ్, కథలు, కవితలు న్యూస్ చదవడం దీనిలో ఒక భాగం అన్నారు. టీవీలకు, మొబైల్‌కు హత్తుకుపోయే పిల్లలకు ఈ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గిరి బాల నేస్తం జిల్లా నాయకులు పి కుమారి, ఎస్. నాగేంద్ర, ఏం.చిట్టిబాబు, మోనీత్, దేవదాసు, రాధిక, సంధ్య, మీనా, విద్యార్థిని, విద్యార్థులుపాల్గొన్నారు.

ఒక్కటైన ప్రేమ జంట

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని మోద కొండమ్మ గుడిలో ప్రేమ జంట ఏకమైంది. తల్లి దండ్రులు, గ్రామ పెద్దలు, పోలీసుల ఆధ్వర్యంలో నూతన పెళ్లి జంటకు మోద కొండమ్మ గూడీలో వివాహం జరిపించారు. గ్రామ పెద్దలు తెలిపిన వివరాలు.. గూడెం మండలం లోని అదే గ్రామానికి చెందిన కొరబు క్రిష్ణ కాంత్, హుకుంపేట మండలం లోని తీగల వలస పంచాయతీ గరుడ పల్లి గ్రామానికి చెందిన కీముడు కాంతమ్మలు 2016 నుంచి ప్రేమలో ఉండి మద్యలో విడిపోయినప్పటికీ గ్రామ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్‌తో మోద కొండమ్మ గూడీలో నూతన జంటను ఒకటిచేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు పాంగి. బేసు, పి.కామేశ్వర రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్న జంట

ఘనంగా మర్రి కామయ్య వర్ధంతి


మర్రి కామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


అరకులోయలో..


ప్రజాశక్తి-కొయ్యూరు


స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదిమ జాతి నేత మర్రి కామయ్య వర్ధంతి కార్యక్రమం మండలంలోని డౌనూరు పంచాయతీ తులబడ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మర్రి కామయ్య యువజన సంఘం, గిరిజన సంఘం నాయకులు తాంబేలు బంగారమ్మ, తాంబేలు చిట్టిబాబు, శంకర్, గెమ్మెలి సానా, సావిత్రి భవాని తదితరులు మర్రి కామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వై.అప్పలనాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం, అడవి మీద హక్కుల కోసం, భూమి కోసం కామయ్య పోరాటం చేశారని తెలిపారు. కామయ్య ఆశయాలు నెరవేర్చినప్పుడే ఆయనకు నిజమైన నివాళులర్పించినట్లు అని పేర్కొన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా పివిటిజిలు 2,50,000 మంది ఉన్నారని, వీరంతా అడవిలో పోడు భూమిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వీరి గ్రామాలకు కనీసం రోడ్డు, మంచినీరు, విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు లేవన్నారు. నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల గురించి పట్టించుకోవడం లేదని, అటవీ హక్కు పత్రాలు ఇవ్వడం లేదని, ఫారెస్ట్ అధికారుల వేధింపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మర్రి కామయ్య స్ఫూర్తితో పై సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాంబేలు అప్పారావు, సత్తిబాబు, నర్సింగరావు, మల్లేశ్వరం, శైలజ, గిరిజనులు పాల్గొన్నారు.

హుకుంపేట : మండలంలోని తీగల వలస పంచాయితీ కామయ్యపేటలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు మర్రి కామయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా మర్రి కామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల క్రిష్ణారావు, వైస్ ఎంపీపీ కొండలరావు మాట్లాడుతూ,దేశ స్వాతంత్ర్యం, గిరిజనుల విముక్తి కోసం తన జీవితాన్ని, ఆస్తిని దారబోసిన మహోన్నత వ్యక్తి మర్రి కామయ్య అని కొనియాడారు. నూతన అటవీ పాలసీతో గిరిజనులను అడవి నుండి దూరం చేసేందుకు కేంద్రం పూనుకుంటుందని విమర్శించారు.బోయ/వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడానికి వైసిపి పూనుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో తీగలవలస మాజీ సర్పంచ్ పల్టాసింగి కామేశ్వరరావు, తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, సీదరి మల్లేష్, శంకర్‌రావు, చిరంజీవి, కొండ పల్లి సూరిబాబు, శెట్టి మత్స్యరాజు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : గిరిజన సంఘం కార్యాలయంలో మర్రి కామయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె నర్సయ్య నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజనులను చైతన్యం చేసి స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, బాషా వాలంటీర్ల సంఘం నాయకులు వి.చంద్రయ్య, కే.కొండయ్య, కే కామేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి పి.భీ మరాజు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : అరకులోయలో గిరిజన సంఘం ఆధ్వర్యాన మర్రి కామయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, నాయకులు ఆయన విగ్రహాన్ని పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, మర్రి కామయ్య గిరిజన ప్రాంతంలో గిరిజనులను అండగా నిలిచి బ్రిటిష్ నిర్బంధాలను ఎదిరించారన్నారు.గిరిజనుల భూమి, అడవులు గిరిజనులకే దక్కాలని పోరాటం చేశారని అన్నారు. జీవో 3పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి చట్టబద్ధత కల్పించలేదన్నారు. గిరిజన చట్టాలు, హక్కులకు వ్యతిరేకంగా గ్రామసభ అనుమతి లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టులను నిర్మాణం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బోయ/ వాల్మికిలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే అసెంబ్లీ తీర్మానం రద్దు చేయాలని ఈనెల 11న అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకులు, సుంకరమెట్ట సర్పంచ్ జి చిన్నబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి పోతురాజు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, నాయకులు కె.రామారావు, గురుమూర్తి పాల్గొన్నారు.


హుకుంపేట మండలం కామయ్యపేటలో..


ముంచంగిపుట్టు గిరిజన సంఘం కార్యాలయంలో...


మాట్లాడుతున్న బాబూరావునాయుడు

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చే

తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

బోయ/వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదివాసీ జెఎసి రాష్ట్ర నాయకులు టి.బాబూరావునాయుడు, జనసేన నాయకులు గంగులయ్య డిమాండ్ చేశారు. స్థానిక పిఎంఆర్‌సి వద్ద శుక్రవారం ఆదివాసీ జెఎసి జిల్లా అధ్యక్షులు కంగల శ్రీనివాస్‌దొర ఆధ్వర్యాన జెఎసి సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న బాబూరావునాయుడు, గంగులయ్య మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షనమే జిఒ 52ను రద్దు చేయాలని, ఆదివాసీ హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలను పట్టించుకోని పార్టీల అవసరం తమకూ లేదని స్పష్టం చేశారు. అనంతరం ఏడు మండలాల్లో ఉన్న ఆదివాసీ నాయకులతో జిల్లా, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేశారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిఐ ఎన్ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని ఫిట్నెస్ కలిగిన వాహనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. సరైన పత్రాలు లేకపోతే వాహనాలను సీజ్ చేసి జరిమానా విధిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేస్తామన్నారు. వాహనాలను అధిక వేగంతో నడపరాదని సూచించారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి ఎస్ఐ రాము, అదనపు ఎస్ఐ మూర్తి, ఏఎస్ఐ కృష్ణ, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

పెదబయలులో భారీ వర్షం

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షంతో జనజీవనం స్తంభించింది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పంట పొలాల్లో నిండుగా నీరు చేరింది. మెయిన్ రోడ్డు పై డ్రైనేజి లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. పరిసర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు నేల కొరిగాయి.

ఘనంగా డైరెక్టర్స్ డే

ప్రజాశక్తి-సీతమ్మధార : దర్శకరత్న కీర్తిశేషులు డాక్టర్ దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ విష్ణు స్కూల్స్, విష్ణు ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యాన డైరెక్టర్ యాదకుమార్ నేతృత్వంలో సింధూర గెస్ట్ హౌస్‌లో డైరెక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన ఎనిమిది మంది ఫిల్మ్ డైరక్టర్లను స్టార్ మేకర్ సత్యానంద, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, రిటైర్డ్ ఎడిసిపి మహమ్మద్ ఖాన్ సత్కరించారు. ఈ సత్కారంలో భాగంగా హాస్య ప్రియ క్రియేషన్స్ పతాకంపై నిర్మించిన దాదాపు ఏడు షార్ట్ ఫిల్మ్‌ల్లో నటించి దర్శకత్వం వహించిన ఈమంది ఈశ్వరరావును కూడా సత్కరించారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -మాధవధార : శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార ట్రస్టు ఆధ్వర్యాన మురళీనగర్‌లో మజ్జిగ పంపిణీని ట్రస్ట్ వ్యవస్థాపకులు కుప్పిలి కీర్తిపట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల పాదచారులు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యాన సిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మజ్జిగ కేంద్రాలను ఏర్పాటుచేసి దాహార్తిని తీరుస్తున్నామని చెప్పారు. వేసవికాలంలో ప్రజలు మజ్జిగ, నీరు, కొబ్బరి నీరు, బార్లీ తదితరాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పైడి కృష్ణారావు, వినోద్, కె.ప్రసాదు, మాధురి, పణిభూషణరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

11లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ పింఛను దారులు ఈ నెల 11వ తేదీలోగా ఇకెవైసి చేయించుకోవాలని ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు టి.భీమారావు, ఎం.ఆనందరావు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులను తీసుకొచ్చి స్థానిక ఎస్‌టియు నాయకులను సంప్రదించి ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. లేకుంటే 12వ తేదీ నుంచి పింఛను డబ్బులు పొందలేరని స్పష్టం చేశారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి- ములగాడ : మల్కాపురం శివారు ఏడుగుళ్ల వద్ద కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల సన్నిధి ప్రాంగణములో శుక్రవారం మధ్యాహ్నం 150 మంది నిరుపేదలకు అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా మల్కాపురం గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ప్రతి బుదవారమూ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. దీనికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక సహాయం చేసిన వారందరికీ గ్రామ కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు బోగవిల్లి నాగభూషణం, అధ్యక్షులు సత్యల మహేష్, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, పట్నాల అప్పారావు (దేముడు), కనకరాజుస్వామి పాల్గొన్నారు.

7న కామెడీ స్కిట్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన క్లబ్ ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు కోరుకొండ రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి భవనంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి విశాఖ హ్యూమర్ క్లబ్, క్రియేటివ్ కామెడీ క్లబ్, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, బాబాయి లాఫింగ్ క్లబ్, అనకాపల్లి లాఫింగ్ క్లబ్, డాక్ యార్డ్ కల్చరల్ క్లబ్‌తోపాటు హైదరాబాద్ కామెడీ క్లబ్ నిర్వాహకులు కూడా పాల్గొని జోక్స్, కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకుల్ని అలరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, గౌరవ అతిథులుగా యాద కుమార్, డాక్టర్ చిట్టిబాబు, పద్మజారెడ్డి పైడి శంకరరావు, ఎమ్మెస్ మాధవ్, ఎస్ఎస్ఎన్ రాజు, బొమ్మిడి సత్యనారాయణ, మహమ్మద్ ఖాన్, కొణతాల రాజు, పణిస్వామి హాజరవుతున్నట్లు రంగారావు తెలిపారు. జబర్దస్త్ ఫ్రేమ్ అప్పారావు, సత్తిపండు హాస్యాన్ని పండిస్తారని సంఘం గౌరవాధ్యక్షులు ప్రసన్నకుమార్, అధ్యక్షులు జీవిత, గౌరవ సలహాదారు జువాది లక్ష్మి తెలిపారు. ఉపాధ్యక్షులు జబర్దస్త్ సత్తిపండు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి దుర్గాప్రసాద్, శ్రీధర్ కోశాధికారి డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ, ఈ నవ్వుల ప్రాంగణానికి అందరూ ఆహ్వానితు లేనని, ప్రతి ఒక్కరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్పందన సమస్యల పరిష్కారానికి చర్యలు



వినతులు స్వీకరిస్తున్న శివశ్రీనివాస్, అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో 73 అర్జీలను స్వీకరించారు. జెసి జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. భూ వివాదాలు, తాగునీటి, రహదారులు, విద్యుత్ సౌకర్యం వంటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జెసి జె.శివ శ్రీనివాసు మాట్లాడుతూ, స్పందన సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ మాట్లాడుతూ, గిరిజన సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. జిల్లా అధికారులు స్పందనకు హాజరు కానప్పుడు దిగువ శ్రేణి అధికారులను పంపించాలని సూచించారు.

స్వీకరించిన ఫిర్యాదులు..

అరకు వ్యాలీ మండలం బొండాం పంచాయతీలోని పివిటిజి గ్రామాలైన రంగినిపాడు, రేగ, కరకవలస, కొరియాగుడ, జయంతివలస, రంపుడువలస, బలియగూడ గ్రామాలకు రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ దురియా భాస్కర రావు వినతిపత్రం సమర్పించారు. చింతపల్లి మండలం లబ్బంది కొత్తవీధి గ్రామంలో ప్రేమాకరరావు భార్య భారం మీనాక్షికి తన భూమిని లీజుకి ఇచ్చానని తనకు తెలియ కుండా తప్పుడు పత్రాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని దానిని నిలుపదల చేయాలని కేదరి వెంకట స్వామి ఫిర్యాదు చేసారు. హుకుంపేట మండలం కొట్నాపల్లి గ్రామానికి చెందిన సిందికోడి మోహన్‌బాబు పియంఇజిపి పథకం కింద కోళ్లు, గొర్రెలు పెంచుకొనుటకు రుణం మంజూరు చేయాలని వినతిపత్రం అందజేసారు. కొయ్యూరు మండలం నల్లగొండ పంచాయతీ బొయఊట, కొత్తవీధి గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఆశ కార్యకర్తను నియమించాలని గ్రామస్తులు పి.నాగేశ్వరరావు, పి.భీమరాజు వినతి పత్రంలో కోరారు. జి.మాడుగుల మండలం పెదవలస గ్రామస్తులు జి.రాంబాబు, జి.వెంకటరావు ఎన్‌టిఆర్ గృహ పథకంలో ఇళ్లు నిర్మించి నాలుగేళ్లు గడిచినా బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. డుంబ్రిగుడ మండలం సొవ్వ గ్రామానికి చెందిన జి.వరజమ్మ తన కుమారుడు జి.షణ్ముఖ్ వరుణ్ సికిల్‌సెల్ ఎనిమియాతో బాధ పడుతున్నాడని పింఛన్ మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ పి.అంబేద్కర్, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఎడిఎంహెచ్ఒ సి.జమాల్ భాషా, టిడబ్ల్యూ ఇఇ కె.వేణుగోపాల్, ఆర్‌అండ్‌బి ఇఇ బాల సుందరబాబు, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్, ఐటిడిఎ పరిపాలనాధికారి హేమలత పాల్గొన్నారు.

సిఆర్‌పిఎఫ్ సేవలు అభినందనీయం

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ చైర్మన్ సుమిత్ కుమార్ తెలిపారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లర్లు, తీవ్రవాద కార్యకలాపాల నియంత్రణ, సమస్యాత్మక ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణలో సిఆర్పిఎఫ్ సిబ్బంది, అధికారులు తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముందుకు వచ్చి రక్తందానం చేయడం సంతోషకరమన్నారు. 198వ బెటాలియన్‌కు సంభందించి సిఆర్పిఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే సూచనల మేరకు రూడకోట, నుర్మతి జి.మాడుగుల, పెదబయలు ఔట్ పోస్టుల నుండి 25 మంది, 234వ బెటాలియన్‌కు సంబంధించి కమాండెంట్ సంజీవ్ ద్వివేది సూచనల మేరకు పాడేరు ఔట్ పోస్ట్‌కు చెందిన ఆరుగురు సిఆర్పిఎఫ్ సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేసారు. వీరితో పాటు పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సుధాకర్ 26వ సారి రక్తందానం చేయటానికి ముందుకు రావడం విశేషం. ఆయన ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్త దాన శిబిరాలలో పాల్గొని రక్తందానం చేయడం విశేషం.



రక్తదానం చేస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

వీల్ చైర్ల పంపిణీ

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో భాగంగా విభిన్న ప్రతిభావంతులైన నలుగురు వికలాంగ లబ్దిదారులకు వీల్ చైర్లను కలక్టర్, రెడ్ క్రాస్ చైర్మన్ అందజేశారు. రెడ్ క్రాస్ సంస్థ అందించిన ఆరు వీల్ చైర్లలో ఇప్పటికే ఇద్దరు లబ్దిదారులను గుర్తించి గత వారం పంపిణీ చేశారు. మిగిలిన నలుగురు లబ్దిదారులను గుర్తించి శుక్రవారం పంపిణీ చేసారు. పేద బడుగు వర్గాల ప్రజలకు సేవలు అందించడానికి రెడ్ క్రాస్ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా కలక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కలక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ పి.అంబేద్కర్, పరిపాలనాధికారి చిన్ని కృష్ణ, సిఆర్పిఎఫ్ 198వ బెటాలియన్ డిప్యూటి కమాండెంట్ భగత్ సింగ్, అసిస్టంట్ కమాండెంట్ బి.ఉదయ్ కుమార్, 234వ బెటాలియన్ అసిస్టంట్ కమాండెంట్ ఎ.మురగావేలు, పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సుధాకర్, జి.మాడుగుల ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సభ్యులు సూర్య రావు, జయలక్ష్మి, లోహితాస్, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా కిశోర్‌కుమార్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగార సూపరింటెండెంట్‌గా ఎస్.కిశోర్ కుమార్‌ను నియమిస్తూ జైళ్ల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్.రాహుల్‌ను రాజమహేంద్రవరం జైలుకు బదిలీచేశారు. కిశోర్‌కుమార్ గతంలో విశాఖ సెంట్రల్ జైల్లో జైలర్‌గా విధులు నిర్వర్తించారు. విజయనగరం జిల్లా జైలు అధికారిగా పనిచేశారు. ప్రస్తుతం నెల్లూరు జైళ్ల శాఖ ట్రైనింగ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా విశాఖ జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

వైభవంగా రెండో విడత చందన సమర్పణ

ప్రజాశక్తి-సింహాచలం: డోలా పున్నమిని పురస్కరించుకొని శుక్రవారం వేకువ జామున స్వామివారికి రెండో విడత చందన సమర్పణను అర్చకులు సంప్రదాయపదంగా నిర్వహించారు. మొదటి చందన సమర్పణం అనంతరం గుమ్మడి పండు ఆకారంలో దర్శనమిచ్చిన స్వామి వారు రెండో విడత చందన సమర్పణ అనంతరం నిండుగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దర్శనం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కొండదిగువన పుష్కరిణి ప్రాంతం చుట్టుపక్కల వంటావార్పులు చేసుకొని భోజనాలు చేశారు. సాయంత్రం పుష్కరిణిలో స్నానమాచరించి సేవ గరిడీలు, విశేష పూజలతో స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ కాలినడకన తడి బట్టలతో మెట్ల మార్గం గుండా సింహగిరికి చేరుకున్నారు. గాలిగోపురం ఎదురుగా స్వామివారిని కీర్తిస్తూ సంకీర్తనలు తెల్లవారులూ ఆలపిస్తూ స్వామివారిని దర్శించుకుంటారు. మరికొందరు తెల్లవారుజాము వరకు స్వామి సన్నిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహించి వేకువజామున స్వామి దర్శించుకుంటారు. డోలా పున్నమి సందర్భంగా సింహాచల పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.

గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగానికి అవార్డు

ప్రజాశక్తి-మధురవాడ : ప్రముఖ వృత్తినిపుణుల సంస్థ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ (ఐఇఇఇ) వైజాగ్ బే సెక్షన్ ఇటీవల విశాఖలో నిర్వహించిన ఐఇఇఇ స్టూడెంట్ కాంగ్రెస్- 2023లో గీతం విద్యార్థుల సాంకేతిక ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలిచింది. రొయ్యల చెరువులలో నీటి ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో మత్స్య సంపద వృద్ధి చెందేలా లోరావాన్ కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తూ గీతం విద్యార్థులు ఎమ్.వర్ధన్, బి.సాయిఅనీష్, ఎస్.అభిజిత్ రూపొందించిన ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలిచిందని ఐఇఇఇ గీతం విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ మహమ్మద్ చిష్టీ తెలిపారు. ఇసిఇ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉదయ్‌కుమార్ పర్యవేక్షణలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించారని వెల్లడించారు. లోరావాన్ టెక్నాలజీ వినియోగం వల్ల రొయ్యల, చేపల చెరువులు ఉండే గ్రామీణ ప్రాంతంలో ఏవిధమైన వైఫై నెట్‌వర్క్ లేకపోయినా 16 కిలోమీటర్ల పరిధి నుంచి చెరువులలోని నీటి నాణ్యతను పర్యవేక్షించవచని పేర్కొన్నారు. ఈ విద్యార్థులను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, అసిస్టెంట్ డీన్ డాక్టర్ ఎల్ఎల్.రాజేశ్వరరావు, ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ జెబి.సెవెంత్ లైన్ అభినందించారు.

కేన్సర్ విజేతలకు హెచ్‌సిజిలో సన్మానం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధిని ఎదుర్కొని ఆరోగ్యంగా జీవిస్తున్న విజేతలకు ఆరిలోవ హెల్త్ సిటీలోని హెచ్‌సిజి ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం సన్మానించింది. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ, 40 ఏళ్లు పైబడిన మహిళలకు ఉచితంగా మోమోగ్రామ్ కేన్సర్ పరీక్షను ఆరు నెలల పాటు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సన్మాన ఉత్సవంలో విశాఖ నార్త్ ఎసిపి చుక్క శ్రీనివాస్ మాట్లాడుతూ, కేన్సర్ నుంచి బయటి పడాలంటే వైద్యంతోపాటు రోగికి ఆత్మస్థైర్యం ముఖ్యమన్నారు. హెచ్‌సిజి ఆసుపత్రిలో రోగులతో వైద్య బృందం స్నేహపూర్వకంగా మమేకమై ఆత్మస్థైర్యాన్ని అందిస్తున్నట్లు ఇక్కడ వైద్యం పొందిన కేన్సర్ నయమైన రోగులు పేర్కొనడం గొప్ప విషయం అన్నారు. అనకాపల్లి డిఎస్‌పి మల్లా మహేష్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ స్పెషల్ సెక్రటరీ టిఎస్ఎన్.మూర్తి, ఆస్పత్రి మెడికల్ ఆంకాలజిస్టులు డాక్టర్స్ సాంకేత్, డాక్టర్ విజయ ఆదిత్య ఈ కార్యక్రమంలో పాల్గొని కేన్సర్ విజేతలకు మెమోంటో, పుష్పగుచ్ఛాలు ఇచ్చి సన్మానించారు.

జోన్-8 ఎంఎంహెచ్‌ఒగా కృష్ణంరాజు

ప్రజాశక్తి-వేపగుంట : జోన్-8 ప్రజారోగ్య శాఖ అధికారిగా జె.కృష్ణంరాజు నియమితులయ్యారు. గతంలో పార్వతీపురం పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సహకారంతో జోన్-8ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీభరత్

'మీ కోసం.. మీ భరత్' ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కారణంగా అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, ఎటువంటి అభివృద్ధి పనులూ జరగడం లేదని టిడిపి విశాఖ పార్లమెంట్ కన్వీనర్ ఎం.శ్రీ భరత్ అన్నారు. మీకోసం మీ భరత్ కార్యక్రమానికి ఆయన శుక్రవారం శ్రీకారం చుట్టారు. దక్షిణ నియోజకవర్గంలోని 34వ వార్డు నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అచ్చియమ్మ పేటలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి పాదయాత్ర నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ తదితరులు పాల్గొన్న ఈ పాదయాత్ర లక్ష్మీదేవి పేట, జెండా చెట్టు, భూపేష్ నగర్, తారకరామా కాలనీ ప్రాంతాల్లో సాగింది. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి 'సైకో పోవాలి - సైకిల్ రావాలి' స్టిక్కర్లు అంటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు వాసుపల్లి రామ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు పుక్కళ్ళ రాజేశ్వరి, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి గనగళ్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999లో పదో తరగతి చదువుకున్న 75 మంది పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ పాఠశాలల్లో చదివి వివిధ ప్రాంతాల్లో పలు రంగాల్లో స్థిరపడిన వీళ్లంతా ఒకే చోట కలుసుకొని సందడి చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తొలుత ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించిన నాటి గురువులు తేజోమూర్తులు వెంకటేశ్వర శర్మ, అప్పారావు, బాబురావు, కుమార్ తదితరుల దంపతులను పూలమాలలు, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ పాఠశాలలో చదివి, ఇక్కడే ఉపాధ్యాయురాలిగా పని చేయడం ఎంతో ఆనందంగా ఉందని వజ్రపు రాజమణి తెలిపారు. పాఠశాల ప్రారంభం నుండి ఇప్పటి వరకు పదో తరగతి చదివిన విద్యార్థులతో త్వరలో వజ్రోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి వెంకటరమణ, గండేపల్లి రమేష్, మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు, స్థానిక ప్రెస్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొల్లపల్లి బాలరాజు, కె శివప్రసాద్, కృష్ణ, బి శ్రీను, ఆలీ, స్థానికులు నోరి దత్తాత్రేయ (దత్తు), పట్నాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు నర్సింగ్ విద్యార్థుల మద్దతు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తమకు న్యాయం చేయాలంటూ ఢిల్లీ వీధుల్లో పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో నర్సింగ్ విద్యార్థులు శుక్రవారం మద్దతు తెలిపారు. ఎఐడిఎస్‌ఒ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షులు కె.అభిలాష్ మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని నలు దిశలా వ్యాపింపజేసిన రెజ్లర్లు తమపై జరిగిన లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీ నడిబొడ్డున రోడ్లపై నిరసన తెలియజేయాల్సి రావడం బాధాకరమన్నారు.

కనకమహాలక్ష్మి ఎఇఒగా తిరుమలేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాత నగరంలోని బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఎఇఒగా కె.తిరుమలేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నవరం ఎఇఒగా విధులు నిర్వహిస్తున్న ఆయన రెండేళ్ల పాటు కనకమహాలక్ష్మి దేవస్థాన ఎఇఒగా విధుల్లో ఉంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సమసమాజ దార్శనికుడు కారల్ మార్క్స్

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల జయంతి

సమసమాజ దార్శనికుడు, ప్రపంచ మేధావి కారల్ మార్క్స్ అని పలువురు వక్తలు కొనియాడారు. మార్క్స్ జయంతి కార్యక్రమాలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం పలుచోట్ల జరిగాయి. ఆ మహనీయుని చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మార్క్స్ జయంతిని జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. తొలుత మార్క్స్ చిత్రపటానికి సంఘం సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ శ్రామికవర్గ విముక్తి కోసం కారల్ మార్క్స్ జీవితాంతం కృషి చేశారని, ప్రపంచంలో దోపిడీ వ్యవస్థ పోవాలని, కార్మిక రాజ్యం రావాలని సిద్ధాంతం రూపొందించారని తెలిపారు. పెట్టుబడిదారీ విధానం సంక్షోభం నుంచి బయటపడడానికి మార్క్స్ రచించిన దాస్ క్యాపిటల్ గ్రంథాన్ని నేడు అధ్యయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.రాజు, పి.మణి, బి.వెంకటరావు, జి.అప్పలరాజు, యు.రాజు, టి.నూకరాజు, చంద్రమౌళి, ఎం.సూరీడు, జి.పోలేశ్వరరావు, వి.భారతి, యల్లాజీ పాల్గొన్నారు.

అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి పాల్గొని మార్క్స్ గొప్పతనాన్ని వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, బిసిహెచ్.మసేన్, ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, జి.రాంబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : మార్క్స్ జయంతి సభ సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో జరిగింది. మార్క్స్ చిత్రపటానికి నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు కృషి చేసిన దార్శనికుడు కారల్ మార్క్స్ అని అన్నారు. ప్రపంచంలోని కార్మికులను, కర్షకులను పెట్టుబడిదారులు, భూస్వాములు ఏ విధంగా దోచుకుంటున్నారో సమాజానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దాస్ క్యాపిటల్ గొప్పతనాన్ని, కమ్యూనిస్టు ప్రణాళిక విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, బి.నూకప్పారావు, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.



అనకాపల్లిలో నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు కోటేశ్వరరావు తదితరులు

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో మార్క్స్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నాయకులు జివిఎన్.చలపతి, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి.. 'పోరాడితే పోయేది ఏమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అని కార్మిక వర్గానికి మార్క్స్ ఇచ్చిన పిలుపును గుర్తు చేశారు. మార్క్స్ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రపంచంలోని అనేక దేశాల్లో దోపిడీ లేని సోషలిస్టు ప్రభుత్వాలు వచ్చాయన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కుమారి, వెంకటరావు, చంటి, రమణ, శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

రఘు ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఎ ప్లస్ గ్రేడ్ గుర్తింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రఘు ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన నాక్ ఎ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో కళాశాలను సందర్శించిన నాక్ నిపుణుల బృందం కళాశాలలో మౌలిక వసతులు, మానవ వనరులు, ప్రయోగశాలలను ప్రత్యక్షంగా పరిశీలించి అత్యుత్తమ ర్యాంకును అందించినట్లు తెలిపారు. ఇప్పటికే తమ కళాశాల అటానమస్, ఎన్‌బిఎ గుర్తింపును కలిగి ఉందని చెప్పారు. కళాశాలలో అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ లేబొరేటరీ, ఎలక్ట్రోలాంజ్, ఇన్నోవేషన్ స్టూడియో, బిఎస్ఎన్ఎస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్, అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ, అడ్వాన్స్‌డ్ కోడింగ్ ఫెసిలిటీలను నాక్ నిపుణుల బృందం ప్రత్యక్షంగా పరిశీలించి ప్రశంసించినట్టు తెలిపారు. కంప్యూటర్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలోని నాలుగు రీసెర్చ్ సెంటర్లు జెఎన్‌టియు గుర్తింపును సైతం కలిగి ఉన్నాయన్నారు. నిపుణత్వం కలిగిన బోధనా సిబ్బంది, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులు తమ ప్రత్యేకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడవద్దని సైకాలజిస్టుల బృందం విజ్ఞప్తి చేసింది. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ బలవన్మరణాలకు పాల్పడుతున్న వారిలో అత్యధిక మంది యువకులు ఉంటున్నారని, దేశంలో ప్రతి 34 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, ఏడాదికి 12,400 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన వెంటనే పరీక్ష తప్పిన 15 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం తమను కలచి వేసిందని చెప్పారు. దీనిని అరికట్టాల్సి ఉందన్నారు. విద్యార్థుల కెరీర్‌పై తల్లిదండ్రులు అధికంగా ఆశపెట్టుకొని, వారిపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తేవటం వల్ల విద్యార్థులు ఆశించిన మేర మార్కులు సాధించని పరిస్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. పరీక్షా ఫలితాలలో గ్రేడ్, ర్యాంకింగ్ విధానాలను ప్రకటించడం మంచిది కాదన్నారు. సమావేశంలో సైకాలజిస్టులు రాజ్యలక్ష్మి, డాక్టర్ వేణుకుమారి, శ్రీదేవి, జిఎ.నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.



సమావేశంలో పాల్గొన్న వంశీ కుంజం, అబ్బులు

తామరపల్లిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని తామరపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ముసురిమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశీ కుంజం మాట్లాడుతూ పిఎం కిసాన్‌కు తక్షణమే ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. అకాల వర్షాలు కారణంగా పంటలు నష్టపోయిన వారిని గుర్తించి, వారికి విత్తనాలు వంటివి సకాలంలో అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహాల కమిటీ చైర్మన్ కుంజం అబ్బులు, సభ్యులు మడకం రామకృష్ణ, కుంజం బుల్లిబ్బాయిదొర, వార్డు మెంబర్ కూర గోపాల్, వైసిపి కార్యకర్త సొమ్మన్న, అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

మూఢ నమ్మకాలపై గిరిజనులకు అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : గిరిజనులు మూఢనమ్మకాలను దరిచేరనివ్వొద్దని సీలేరు ఎస్ఐ రామకృష్ణ అన్నారు. జీకే వీధి మండలం ధారకొండలో శుక్రవారం మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూఢనమ్మకాలతో ప్రజలు తమ జీవితాలను వృథా చేసుకోవద్దని హితవు పలికారు. చెడుపు, చిల్లంగులు వంటివి కేవలం మూఢనమ్మకాలు మాత్రమేనని, అటువంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భూ తగాదాలు ఏమైనా ఉంటే గ్రామ పెద్దల సమక్షంలో రెవెన్యూ అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని, లేదంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే కౌన్సిలింగ్ ద్వారా సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామని చెప్పారు.

గ్రంథాలయాల్లో పిల్లలకు వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో పిల్లలకు వేసవి శిబిరాలు నిర్వహించి సృజనాత్మకతకు పదును పెట్టనున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అందుకు సంబంధించిన బ్యానర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 11 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వీటికిగాను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.25 వేలు, గ్రేడ్ 1 గ్రంథాలయానికి రూ.15 వేలు, గ్రేడ్ 2 గ్రంథాలయానికి రూ.12 వేలు, గ్రేడ్ 3 గ్రంథాలయానికి రూ.10 వేలు చొప్పున బడ్జెట్ మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని గ్రంథాలయాల సిబ్బంది పాల్గొన్నారు.